మల్కాజిగిరి లోక్‌సభ బరిలో 22 మంది అభ్యర్థులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గం బరిలో 22 మంది అభ్యర్థులు మిగిలారని ఎన్నికల అధికారి గౌతమ్ తెలిపారు. పరిశీలన తర్వాత 37 మంది అభ్యర్థుల నామినేషన్లను ఆమోదించామన్నారు. ఉపసంహరణ కార్యక్రమంలో భాగంగా 15 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోగా, 22 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారన్నారు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులకు వారి సమక్షంలో గుర్తులు(సింబల్) కేటాయించినట్లు ఆయన తెలిపారు.

ఎన్నికలు ప్రశాంతంగా సాగేలా సహకరించాలి

జనరల్ పరిశీలకులు డాక్టర్ ప్రియాంక శుక్లా

సాక్షి, మేడ్చల్ జిల్లా: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సజావుగా సాగేందుకు రాజకీయ పార్టీ ప్రతినిధులు సహకరించాలని జనరల్ పరిశీలకులు డాక్టర్ ప్రియాంక శుక్లా అన్నారు. కలెక్టరేట్ వీసీ మీటింగ్ హాల్‌లో పోలీస్ అబ్జర్వర్ డాక్టర్ రామేశ్వర్ సింగ్, వ్యయ పరిశీలకులు ధృవ్ భోళా, మనోజ్ అలోస్ లక్రా, జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్‌తో కలిసి సోమవారం పార్టీల ప్రతినిధులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎన్నికల విధి విధానాలను వివరించారు. జిల్లాలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్‌లు పర్యవేక్షిస్తుంటాయని తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున రాజకీయ పార్టీలు అభ్యర్థులు చేసే ప్రతి ఖర్చును ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఎంసీఎంసీ సెల్ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలు ప్రసారం చేయడం, సంబంధిత అభ్యర్థి ప్రచార ఖర్చులో వాటిని లెక్కించడం జరుగుతుందని తెలిపారు. సోషల్ మీడియాలో అభ్యర్థుల రాజకీయ ప్రకటనలు వంటివి సకాలంలో ఆమోదిస్తూ మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌ఓ హరిప్రియ, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఈవీఎంల వద్ద పటిష్ట భద్రత

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలింగ్ అనంతరం అసెంబ్లీ సెగ్మెంట్లలో ఈవీఎం స్ట్రాంగ్ రూంల వద్ద పటిష్ట భద్రత చర్యలు తీసుకోవాలని సాధారణ పరిశీలకులు డాక్టర్ ప్రియాంక శుక్లా అన్నారు. ఎన్నికల సాధారణ పరిశీలకులు, జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డితో కలిసి హోలీ మేరీ కాలేజీలో సోమవారం ఏర్పాటు చేసిన అసెంబ్లీ నియోజకవర్గాలైన మల్కాజిగిరి, మేడ్చల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ ఈవీఎంలను భద్రపరిచేందుకు ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను తనిఖీ చేశారు. అవసరమైన చోట తక్షణమే మరమ్మతులు చేపట్టి పనులు పూర్తి చేయించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.

'కవులు, రచయితలు, కళాకారులపై దాడులు హేయం'

పంజగుట్ట: వరంగల్‌లో కవులు, రచయితలు, కళాకారులపై జరిగిన దాడులు ఫాసిజానికి పరాకాష్ట అని సెక్యులర్ రైటర్స్ ఫోరం బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దాడులకు గురైన కేంద్ర యువ సాహిత్య అవార్డు గ్రహీత డాక్టర్ పసునూరి రవీందర్, భూపతి వెంకటేశ్వర్లు, నరేష్ కుమార్ సూఫీ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... కాకతీయ యూనివర్సిటీలో సెక్యులర్ రైటర్స్ ఫోరం ఆధ్వర్యంలో లౌకిక విలువలు–సాహిత్యం అనే అంశంపై సదస్సు నిర్వహించామన్నారు. వీసీ అనుమతితో, యూనివర్సిటీ ఉన్నతాధికారులు కూడా సదస్సుకు హాజరయ్యారన్నారు. సదస్సు జరుగుతుండగా కొంతమంది ఏబీవీపీ కార్యకర్తలు ఒక్కసారిగా అక్కడికొచ్చి మీకు అనుమతి ఎవరు ఇచ్చారు అంటూ బూతులు మాట్లాడుతూ బ్యానర్‌ని చింపేశారని, పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడకు వచ్చిన పోలీసులు వారిని బయటకు పంపించారని ఆరోపించారు. సదస్సు పూర్తయ్యాక బయటకు వెళ్లే సమయంలో సుమారు 60 మంది ఏబీవీపీ కార్యకర్తలు బయట వేచి ఉండి మమ్మల్ని అడ్డగించి బూతులు తిడుతూ చేతుల్లోని పుస్తకాలను లాక్కుని తమపై దాడి చేశారని తెలిపారు. అక్కడే ఉన్న పోలీసులు కూడా ప్రేక్షకపాత్ర వహించడం బాధాకరమని పేర్కొన్నారు. సమావేశంలో విప్లవ శ్రీనిధి, వద్దిరాజు ప్రవీణ్ కుమార్, స్కైబాబు పాల్గొన్నారు.

మూన్‌షైన్ పబ్ యజమానిపై క్రిమినల్ కేసు

ఫిలింనగర్: పబ్‌లో గొడవకు పాల్పడుతున్న వారిని నిర్లక్ష్యంగా రోడ్డుపైకి వదిలేసి ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించడమే కాకుండా పోలీసులకు సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–82లోని మూన్‌షైన్ పబ్ యజమానిపై ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలివీ... శనివారం అర్ధరాత్రి మూన్‌షైన్ పబ్‌లో రాకేష్, సంతోష్‌లు అనే ఇద్దరు యువకులు గ్యాంగ్‌లుగా ఏర్పడి బాహాబాహీకి దిగారు. ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటుండటంతో ఇక్కడ బౌన్సర్లు రాజు, ఇస్మాన్, అలీలు వారందరినీ మద్యం మత్తులో ఉండగానే రోడ్డు పైకి నెట్టేశారు. దీంతో సంతోష్, రాకేష్‌తో పాటు మరికొందరు రోడ్డుపై న్యూసెన్స్‌కు పాల్పడ్డారు. తమకు సమాచారం ఇవ్వడంలో నిర్లక్ష్యం, పబ్ నిర్వహణలో లోపాలు కారణంగానే అర్ధరాత్రి పబ్ ఎదుట న్యూసెన్స్ ఏర్పడిందని, వీరిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఫిలింనగర్ కానిస్టేబుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు పబ్ యజమానితో పాటు బౌన్సర్లపై ఐపీసీ సెక్షన్290, 336 కింద కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

స్టార్టప్స్ ప్రోత్సాహం కోసం రూ.50కోట్ల నిధి ఏర్పాటు

సాక్షి, సిటీబ్యూరో: ఔత్సాహిక స్టార్టప్‌లలో రూ. 50కోట్ల వరకు పెట్టుబడి సహాయం అందించేందుకు యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్ (వైఇఏ) మాగ్నిఫిక్ క్యాపిటల్ ట్రస్టులు ఫైరోకేర్ సృష్టికర్త డాక్టర్ ఎ వేలుమణితో భాగస్వామ్యం కుదుర్చుకున్నాయి. అందులో భాగంగా ప్రత్యేక నిధిని ఏర్పాటు చేస్తున్నట్టు నగరంలో నిర్వహించిన వార్షిక సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు ఆయా సంస్థల ప్రతినిధులు ప్రకటించారు. ఈ సందర్భంగా యంగ్ ఎంటర్‌ప్రెన్యూర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సుభాకర్ ఆలపాటి మాట్లాడుతూ, గత దశాబ్దకాలంగా స్టార్టప్‌లకు మద్దతు అందిస్తున్నామని, ఈ కొత్త ఫండ్ ప్రారంభం స్టార్టప్ వ్యవస్థ విస్తరణలో ఒక మైలురాయిగా పేర్కొన్నారు. భిన్న రంగాలలో ఆవిష్కరణలు చేస్తున్న స్టార్టప్స్ తమకు info@yeaindia.orgలో దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు.

సోలార్ ఉత్పత్తుల్లో విప్లవాత్మకమైన వృద్ధి

సాక్షి, సిటీబ్యూరో: ప్రత్యామ్నాయ విద్యుత్‌కు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో సోలార్ ఉత్పత్తుల్లో అత్యాధునిక ఆవిష్కరణలు మరింత ఊపందుకోనున్నాయని నిపుణులు విశ్లేషించారు. పునరుత్పాదక విద్యుత్‌శక్తిపై మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న రెన్యూఎక్స్ ఈవెంట్ ముగిసింది. ఈ సందర్భంగా సోలార్ ఉత్పత్తుల తయారీకి పేరొందిన ఎస్ఎమ్ఏ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఓ సమావేశంలో సంస్థ డైరెక్టర్ కరణ్‌సింగ్ సదస్సులో తమ భాగస్వామ్యం, సంబంధిత వివరాలను వెల్లడించారు. నగరంలో నిర్వహించిన ఈవెంట్‌లో సన్నీ ట్రై పవర్ కోర్ 2, సన్నీ హై పవర్ పీక్ 3 వంటి అత్యాధునిక ఉత్పత్తులను ప్రదర్శించామన్నారు.

కారు జోరు... ప్రచార హోరు

రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా ప్రచారంలో జోరు పెంచిన గులాబీ దళం


కూకట్‌పల్లి డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ

మూసాపేట: మల్కాజిగిరి లోక్‌సభ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతు గులాబీ దళం జోరుగా ప్రచారం చేస్తోంది. కార్యకర్తలు కారు స్పీడ్ పెంచి నియోజకవర్గంలోని గల్లీగల్లీకి వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థించారు. అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి కూతురు మౌనిక సోమవారం స్థానిక కార్పొరేటర్ శిరీష బాబూరావుతో కలిసి బాలాజీనగర్ డివిజన్ పరిధిలో ప్రచారం చేశారు. కేపీహెచ్‌బీకాలనీలో ఓటర్లను నేరుగా కలిసి బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేసిన అభివృద్ధిని... ప్రస్తుత ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. అందుకే లోక్‌సభ ఎన్నికల్లో కారు గుర్తుకే ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ శిరీష మాట్లాడుతూ.. రాగిడి లక్ష్మారెడ్డి అఖండ మెజార్టీతో విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. మన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ప్రజలు పూర్తి విశ్వాసంతో ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ వైఫల్యాలను, 420 హామీలతో జనాలను వంచించిన విషయాలను ఓటర్లకు వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగుడాల బాబూరావు, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్ గౌడ్, కార్యదర్శి వెంకటేష్ చౌదరి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు అనితా శ్రీపద, డివిజన్‌మహిళా అధ్యక్షురాలు అరుణాశెట్టి, నాయకులు పవన్‌కుమార్, తిరుపతిరావు, జాన్ మోజెస్, నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి..

కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు సోమవారం మూసాపేట మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ ప్రచారం నిర్వహించారు. రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ఇంటింటికీ వెళ్లి ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మి పేరుతో మహిళలను మోసం చేసిందన్నారు. పేదలకు రూ.500లకే గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తామని మాట తప్పారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో అన్ని వర్గాల ప్రజలు కాంగ్రెస్ పాలనపై అసంతృప్తితో ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుందర్, తుకారాం, విష్ణు, రాజు, రవిసింగ్, వెంకటస్వామి, జైరాజ్, కృష్ణ, అరుణ్, శ్యామల, మంగమ్మ, సూర్యకళ, హరిత, శాంత, రమాదేవి, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ నుంచి అత్యధిక ఓట్లు బీఆర్ఎస్‌కే వేయాలి..

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పరిధిలోని శివబస్తీలో సోమవారం రాగిడి లక్ష్మారెడ్డి గెలుపే లక్ష్యంగా కార్పొరేటర్ సబిహా బేగం ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఓటర్లకు వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అల్లాపూర్ డివిజన్ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. అదే విధంగా పలు సంక్షేమ పథకాలు ఇక్కడి ప్రజలకు అందాయని తెలిపారు. వీటిని దృష్టిలో పెట్టుకొని అల్లాపూర్ డివిజన్ నుంచి అత్యధిక ఓట్లు బీఆర్ఎస్‌కే వేయాలని కోరారు.

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి...

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి డివిజన్ పరిధిలో సోమవారం కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు. దయార్‌గూడ, దేవినగర్, కేరళ కాలనీల్లో ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. టీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే కూకట్‌పల్లి నియోజకవర్గ అభివృద్ధి జరిగిందన్నారు. అనేక సంక్షేమ పథకాలు డివిజన్ వాసులకు అందాయని అన్నారు.


ఇంటింటికీ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని ప్రచారం చేస్తున్న తూము శ్రావణ్‌కుమార్


అల్లాపూర్ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ సబిహా బేగం


రాగిడి లక్ష్మారెడ్డి కూతురు మౌనికతో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ శిరీష బాబూరావు

కాంగ్రెస్‌ను గెలిపించండి.. ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకురండి

చేవెళ్ల లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి



లాస్ట్ బస్‌స్టాప్‌లో జరిగిన కార్నర్ సమావేశంలో రంజిత్‌రెడ్డి, జగదీశ్వర్‌గౌడ్


ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

ఆల్విన్‌కాలనీ: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా సోమవారం ఆల్విన్‌కాలనీ లాస్ట్ బస్ స్టాప్ వద్ద కార్నర్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి చేవెళ్ల లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి రంజిత్‌రెడ్డి హాజరై మాట్లాడారు. చేవెళ్ల ప్రాంతపు సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న వ్యక్తిగా... వాటికి పరిష్కారం చూపగలిగే నాయకుడిగా... మీ ముందుకు వచ్చానన్నారు. ప్రతి ఒక్కరూ మే 13న జరిగే ఎన్నికల్లో తమ బాధ్యతగా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. కేంద్రంలో పదేళ్ల బీజేపీ పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని అన్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి అనే మాట పక్కకు పెట్టిందన్నారు. శేరిలింగంపల్లిలో కేంద్ర ప్రభుత్వంతో ముడిపడి ఉన్న ఎన్నో సమస్యలు పరిష్కరించలేదన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో తనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. మరోసారి ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకురావాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

- కేంద్రంలో రాహుల్ గాంధీ నాయకత్వం బలపరిచే విధంగా చేవెళ్ల లోక్‌సభ నుంచి తనను గెలిపించాలని కోరారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయత్వంలో అభివృద్ధే ప్రధాన ఎజెండాగా ముందుకు సాగుతున్నారని అన్నారు. చేవెళ్ల లోక్‌సభ అభ్యర్థిని గెలిపిస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఇన్‌చార్జి వి. జగదీశ్వర్‌గౌడ్, టీటీడీసీ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ఎంబీసీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జేరిపేటి జైపాల్, ఆల్విన్ కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్ భానుప్రసాద్, ఆల్విన్‌కాలనీ డివిజన్ అధ్యక్షుడు మారెళ్ల శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాలి : కార్పొరేటర్ దొడ్ల

చేవెళ్ల లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక ఓట్ల మెజార్టీతో గెలిపించుకోవడానికి డివిజన్‌లో విస్తృతంగా ప్రచారం చేస్తున్నానని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్‌లో సోమవారం కాంగ్రెస్ నాయకులతో కలిసి పీజేఆర్‌నగర్ సబ్‌స్టేషన్ వద్ద నుంచి పాదయాత్ర చేస్తూ ఇంటింటికీ వెళ్లి కాలనీవాసులను ఆప్యాయంగా పలకరిస్తూ హస్తం గుర్తుకే ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఓటర్లకు కరపత్రాలు పంచారు. ప్రచారంలో యువనేత దొడ్ల రామకృష్ణగౌడ్, సమ్మారెడ్డి, అనిల్‌రెడ్డి, సీహెచ్. భాస్కర్, పాండుగౌడ్, గుడ్ల శ్రీనివాస్, షౌకత్ ఆలీ మున్నా, సయ్యద్, సంగమేష్, అగ్రవాసు, యాదగిరి, నాగేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్స్ 'మాట.. పాట' అదుర్స్

సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో మాట, పాట కార్యక్రమం


మాట పాట కార్యక్రమంలో పాల్గొన్న సీనియర్ సిటిజన్స్

పంజగుట్ట: వారంతా పదవీ విరమణ పొందిన వారు. ఆదివారం రాత్రి సుమారు 50 మంది అందరూ ఒక్కచోట కలుస్తారు. పాటలు, ఆటలు, మాటలతో యువకుల్లా మారిపోతారు. ఆనంద్‌నగర్ కాలనీ సీనియర్ సిటిజన్స్ ఫోరం ఏర్పాటు చేసుకుని ఆనంద్‌నగర్ కాలనీ మహిళా మండలిలో కళావేదిక ప్రాంగణం ఒకటి ఏర్పాటు చేసుకుని అక్కడ లైబ్రరీ, క్యారం బోర్డ్, చెస్ లాంటి ఆటలు ఆడుకుంటూ కాలక్షేపం చేస్తుంటారు. ఈ ఆదివారం మాట, పాట కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి పాతతరం సినీ నటులు సబిత (సప్తపది) హీరోయిన్, ఢిల్లీ రాజేషంలు వచ్చి వీరితో కలిసి మాట, పాట కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. రోజూ సాయంత్రం సుమారు 20 మంది సీనియర్ సిటిజన్స్ ఇక్కడ కలుసుకుని లైబ్రరీలో పుస్తకాలు చదవడం, మంచి చెడు మాట్లాడుకోవడం, చెస్, క్యారం బోర్డు ఆడుతుంటామని ఫోరం సెక్రటరీ ఎన్.డి.ప్రభాకర్, అధ్యక్షుడు సూరి వెంకటేశ్వర్లు తెలిపారు.

నేడు శత అష్టోత్తర కలశాభిషేకం

మోతీనగర్: మోతీనగర్, కబీర్‌నగర్‌లోని శ్రీ శివరామాంజనేయ ఆలయంలో 30వ తేదీ ఉదయం 7.30 గంటలకు అఖిల భారత శ్రీ హనుమద్దీక్షాపీఠమ్ పీఠాధిపతి శ్రీ దుర్గాప్రసాద్ స్వామివారి చేతుల మీదుగా శత అష్టోత్తర కలశాభిషేకం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పేర్కొన్నారు.

మే 23 నుంచి మీడియా సదస్సు

పంజగుట్ట: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మే 23 నుంచి 27వ తేదీ వరకు రాజస్థాన్‌లోని అకాడమీ ఫర్ ఏ బెటర్ వరల్డ్‌లో 'విజన్ అండ్ వాల్యూస్ ఫర్ ఏ న్యూ సోషల్ ఆర్డర్ రోల్ ఆఫ్ మీడియా' అనే అంశంపై ప్రత్యేక సదస్సును నిర్వహించనున్నట్లు బ్రహ్మకుమారీస్ మీడియా జాతీయ కోఆర్డినేటర్ సరళ తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని బహెన్ పార్వతి, విశాలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... బ్రహ్మకుమారీస్‌కు అనుబంధంగా ఉన్న 22 విభాగాల్లో మీడియా విభాగం ఒకటన్నారు. నిత్యం పని ఒత్తిడిలో ఉండే మీడియా ప్రతినిధులు కొన్నిరోజులు ఆధ్యాత్మిక జ్ఞానం కోసం సదస్సుకు హాజరు కావాలని కోరారు. దేశవ్యాప్తంగా 500 మంది మీడియా ముఖ్యులు కార్యక్రమానికి హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.


సదస్సు కరపత్రం ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఉచిత డ్రైవింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఉచిత డ్రైవింగ్ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఎలైట్ డ్రైవింగ్ స్కూల్ డైరెక్టర్ ఉపేందర్ అన్నారు. సోమవారం బాగ్‌లింగంపల్లిలో కేశవ స్మృతి సంవర్ధన సమితి, కేశవ నిలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత డ్రైవింగ్ స్కూల్ శిక్షణ తరగతుల 10వ బ్యాచ్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఉపేందర్ మాట్లాడుతూ.. యువత ఉచిత డ్రైవింగ్‌లో శిక్షణ పొంది ఉపాధి వైపు పయనించాలన్నారు. కేశవ స్మృతి సంవర్ధన సమితి ప్రధాన కార్యదర్శి కొప్పారపు బాలయ్య, రామచంద్రన్ పాల్గొన్నారు.

'నాట్య తరంగిణి' నృత్యోత్సవం



మాదాపూర్: కళాకారులు సాంస్కృతిక ప్రదర్శనలతో సందర్శకులను ఆకట్టుకున్నారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో సోమవారం అంతర్జాతీయ నృత్యోత్సవాలలో భాగంగా కందుల కూచిపూడి నాట్యాలయం గురువు రవి కూచిపూడి, శిల్పారామం సంయుక్తంగా నాట్య తరంగిణి నృత్యోత్సవాన్ని నిర్వహించారు. కలకత్తాకి చెందిన రాజీబ్ ఘోష్ బృందం కథక్ ప్రదర్శనతో అలరించారు. ఇందులో శివతాండవం, తరణ అంశాలను ప్రదర్శించారు. ఒరిస్సాకి చెందిన దేబాశిష్ పట్నాయక్ ఒడిసీ నృత్యప్రదర్శనలో మధురాష్టకం, ఆంగిక, అంశాలను, కెనడాకు చెందిన శక్తిసంజన సిరాలా, రిషికేష్, దేవి కీర్తనం అంశాలను, మోహినియట్టం స్వర్ణదీప, పేరిణి సంతోష్ పెరుమాండ్ల పేరిణీ తాండవంను ప్రదర్శించారు. రవి కూచిపూడి శిష్యబృందం కూచిపూడి నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు.ఇందులో పూజ నృత్యం, ఆధ్యాత్మిక రామాయణ కీర్తన, జయము జయము, మూషికవాహన అంశాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నాట్యగురువులు సంజయ్‌జోషి, వేదాంతం సత్య నరసింహశాస్త్రి విచ్చేసి కళాకారులను ఆశీర్వదించారు.

కవులపై దాడులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం : సమూహ కవులు, రచయితలపై ఏబీవీపీ దాడులు సరికాదని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ సాహితీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనందచారి, రాష్ట్ర అధ్యక్షులు వల్లభాపురం జనార్దన్, సహాయ కార్యదర్శి సలీమలు అన్నారు. సోమవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో వారు మాట్లాడుతూ.. ఆదివారం కాకతీయ యూనివర్సిటీలో కేంద్ర సాహిత్య అకాడమీ గ్రహీతలు పసునూరి రవీందర్, మెర్సీ మార్గరెట్, కవి నరేష్‌కుమార్, టీవీఎస్‌కే నాయకులు భూపతి వెంకటేశ్వర్లుపై దాడి చేస్తూ.. చేయి చేసుకున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

తప్పిపోయిన చిన్నారి.. గంటలోనే కనుగొన్న ఆచూకీ

మోతీనగర్: ఇంటి ముందు ఆడుకుంటూ అదృశ్యమైన చిన్నారిని కొన్ని గంటలోనే చిన్నారి ఆచూకీని పోలీసులు కనుగొని తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సంఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఉదయం 7గంటల ప్రాంతంలో 8 సంవత్సరాల హాసిని అనే చిన్నారి ఇంటి ముందు ఆడుకుంటూ ఎక్కడికో వెళ్లిపోయి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఆమె తల్లి కావ్య పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో అల్లాపూర్ ఇన్‌స్పెక్టర్ సామల వెంకట్‌రెడ్డి పర్యవేక్షణలో పోలీసులు గాలించి కేవలం ఒక గంటలోనే చిన్నారి ఆచూకీని కనుగొన్నారు. అనంతరం చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించడంతో వారు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.



పార్కుల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తాం

కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు




సమతానగర్‌లోని పార్కును వాకర్స్‌తో కలిసి సందర్శిస్తున్న కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: సమతానగర్‌లోని పార్కులో సోమవారం వాకర్స్‌తో కలిసి పార్కును హైదర్‌నగర్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్కులో వాకింగ్‌కు వచ్చేవారికి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. అదే విధంగా పార్కు గోడలపై వినూత్నమైన చిత్రాలను వేయించి, పార్కు చుట్టు పక్కల మొక్కలు, ఫుట్‌పాత్‌లపై బెంచీలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రాబోయే తరాలకు పచ్చదనాన్ని ఇవ్వడానికి తన వంతు బాధ్యతగా స్థానికులందరూ పార్కులను సంరక్షించుకోవాలని తెలిపారు. అదే విధంగా పార్కులో పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

గడప గడపకు ప్రచారం.. కాంగ్రెస్ విజయానికి శ్రీకారం


కేపీహెచ్‌బీ డివిజన్‌లో ప్రచారంలో భాగంగా ఓటర్లకు అభివాదం తెలుపుతున్న బండి రమేష్

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని కేపీహెచ్‌బీ డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొప్పిశెట్టి దినేష్ కుమార్, కంటెస్టెడ్ కార్పొరేటర్ గంధం రాజు ఆధ్వర్యంలో టీపీసీసీ సెక్రటరీ, కేపీహెచ్‌బీ డివిజన్ ఇన్‌చార్జి గాలి బాలాజీ పర్యవేక్షణలో రమ్యా గ్రౌండ్ వద్ద నుంచి ఎల్ఐజీ, ఎంఐజీ ప్లాట్ వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు భారీ స్థాయిలో పాదయాత్ర నిర్వహించారు.

బొట్టుపెట్టి.. ఓటు వేయాలని కోరి..

- ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, నియోజకవర్గ కో–ఆర్డినేటర్ కోటంరెడ్డి వినయ్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మహిళా నాయకులు ఉత్సాహంతో గడప గడపకు వెళ్లి మహిళలకు బొట్టు పెట్టి మల్కాజ్‌గిరి లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి పట్నం సునీతా మహేందర్‌రెడ్డికు ఓటు వేయాలని అభ్యర్థించారు.

కాంగ్రెస్‌లో చేరిన యువకులు..

- అనంతరం కాంగ్రెస్ పార్టీకి ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి భారీగా కాంగ్రెస్ పార్టీలో చేరారు. యువ నాయకులు రాజేష్, సుబ్బు మిత్ర బృందం సుమారు 50 మంది యువకులు కొప్పిశెట్టి దినేష్ కుమార్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.
- అదే విధంగా గంధం రాజు ఆధ్వర్యంలో గంధం బాలకృష్ణ తన మిత్రబృందంతో సుమారు 50 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి బండి రమేష్, కోటంరెడ్డి వినయ్‌రెడ్డి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏ–బ్లాక్ అధ్యక్షుడు నాగిరెడ్డి, బీ–బ్లాక్ అధ్యక్షుడు తూము వేణు, డివిజన్ అధ్యక్షులు ప్రవీణ్‌కుమార్, బాబ్జీ, వనజ, సంధ్య, మంథం మల్లి, పీఆర్ నాయుడు, సరోజ, దుర్గా, వీణ, సోని తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి పిడికిటి గోపాల్‌చౌదరి

- కూకట్‌పల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ సోషల్ మీడియా ఉపాధ్యక్షుడు పిడికిటి గోపాల్ చౌదరి కాంగ్రెస్‌లో చేరారు. సోమవారం కూకట్‌పల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్ ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ.. ఇతర పార్టీల నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిపాలన, కాంగ్రెస్ ప్రభుత్వ పథకాలను చూసి కాంగ్రెస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు.